# ముంపు

ఆ రోజంతా ఎన్ని పనులు చేస్తున్నా నన్ను ఆ ఉత్తరంలోని విషయం కలవరపెడుతోంది. సిగరెట్టు కాలుస్తూ టేబుల్ ల్యాంపు వెలుతుర్లో జిడ్డు కృష్ణమూర్తి పుస్తకం చదువుతున్నాను. తీరికవేళల్లో తాత్విక గ్రంథాలు చదవడం, మరీ తీరిక దొరికితే మిత్రులతో తాత్విక చర్చలు చేయడం నాకిష్టమైన విషయాలు. చాలాసార్లు ఆఫీసు విషయాల్లో అధికారులతో ఘర్షణ పడ్డప్పుడు నా ఆలోచనలు ఫిలాసఫీని ఆశ్రయిస్తాయి. పుస్తకం లోని నాలుగైదు పేరాలు చదివి ఆలోచిస్తూ ఉన్నాను. ఎందుకో మళ్ళీ మళ్ళీ నా ఆలోచనలు సత్యం ఉత్తరంలోని విషయంలోకి వెళ్ళిపోతున్నాయి. యాంత్రికంగానే లేచి గోడకు తగిలించిన చొక్కా జేబులోంచి ఉత్తరం బయటకు తీసి చూశాను. ఉత్తరంలోని చివరి పేరా వైపు నా కళ్ళు వెతుక్కుంటూ వెళ్ళాయి.

"అన్నయ్యా, ఇంకో విషయమేమిటంటే - మన ఊరులో ప్రాజెక్టు కడతారంట. అంటే మన పెన్నేటి బ్రిడ్జి నించి ఆనకట్ట ప్రారంభమవుతుందంట. మనూరితో పాటూ నీటి మునక కింద పద్నాలుగు గ్రామాలు ఉన్నాయంట. ప్రభుత్వం వారు మన భూములకీ, ఇళ్ళకీ నష్టపరిహారం కట్టిస్తారంట. నువ్వు వీలయినంత తొందరగా వచ్చి ఇక్కడి విషయాలు చూసుకోవాల్సి ఉన్నది. నువ్విక్కడి కొచ్చినాక విషయాలన్నీ వివరంగా మాట్లాడుకోవచ్చు. వదినకు నా నమస్కారాలు. శ్యామల, కళ్యాణిలకు నా ముద్దులు...

ఉంటాను.

నీ తమ్ముడు

సత్యం."

ఉత్తరాన్ని టేబులు మీద ఉంచేసి మంచం మీద వాలిపోయాను. అప్పటికే పిల్లలిద్దరూ మంచాలపై అడ్డదిడ్డంగా పడి నిద్రపోతున్నారు. అరుణ వంటింట్లో పాత్రల్ని సర్దుతున్న శబ్దం వినిపిస్తోంది.

కేవలం నామమాత్రంగా తెలిసిన ఒక మనిషి ఏదైనా భయంకరమైన వ్యాధికి గురై, మరో మూణ్ణెల్లలో

మన మధ్య ఉండడని తెలిస్తే భరించలేమే! అట్లాంటిది కన్నతల్లి లాంటి ఊరు - నీటి మునకలో కొంతకాలం తర్వాత ఊరన్నది నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకు పోతుందని తెలిస్తే ఎలా భరించడం? మనసంతా చెప్పలేని దిగులు అలముకుంది. ఏదో అసంతృప్తి - ఊరికి దూరంగా ఉండడం వల్లనేమో మరీ ఎక్కువగా ఇదయిపోతున్నాను.

నా చిన్నతనపు రోజులు ఒక్కటొక్కటే స్మృతిపథంలో మెదలుతున్నాయి.. పెన్నేరూ, దాని మీద ఎప్పటిదో పాత బ్రిడ్జీ, దాన్ని దాటుతున్నట్లే హనుమంతరాయుని గుడి, దాని ముందున్న రావీ, వేపచెట్లూ, వాటికి కొంత దూరంలో సుంకేసుల చెట్టూ, దాని మీద కోతికొమ్మచ్చి మిత్రులతో ఆడుకోడాలూ, ఊర్లో రచ్చబండ వద్ద పేపరు చదువుతూ హాస్యాలాడుకునే యువతరం. ఊరికి పడమటి వేపున్న కృష్ణాపురం వంకా, ఆ వంకలో ఈతచెట్లూ, గరిక బయళ్ళూ, జమ్మి పొదలూ, వాటి మధ్య పశువుల మంద, పశువుల కాపర్ల గొంతుల్లో చెంచు నాటకం పద్యాలూ...

ఎవరికయినా బాల్యం అంటే - ఆటలూ, పాటలూ, నేస్తాలూ, ఆ నేస్తాలతో తిరిగే ప్రదేశాలూ, అప్తులతో విందులూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, రకరకాల అనుభవలూ, వాటిని పొందిన పరిసరాలేగా!

"ఏమిటీ అప్పుడే పండుకున్నావా" అంది అరుణ.

"ఊc ఏదో ఆలోచిస్తూ అట్లా అడ్డం పడ్డాను".

"ఏమాలోచిస్తున్నావు" అంటూ తాంబూలాన్ని పళ్ళెంలో తెచ్చి నా పక్కన కూచుంది అరుణ.

తాంబూలమంటే నాకు ఆరవ ప్రాణమని అరుణకు తెలుసు. ప్రతిరోజూ రాత్రి భోజనానంతరం తాంబూల సేవనం తప్పనిసరి. అసలు నా చిన్నతనంలోని మొదటి జ్ఞాపకం మా అవ్వ ఇచ్చిన వక్కాకు వేసుకోవడం, రెండవ జ్ఞాపకం, మూడవ జ్ఞాపకమూ అదే.. ఎర్రగా నములుతూ మా అవ్వ ఒళ్ళో దూరి పడుకునేవాణ్ణి. మా నాన్న ఇంట్లోకి అడుగు పెడుతున్నట్టే గబుక్కున మింగేసి, మా అవ్వ కొంగుతో పళ్ళమీదీ, పెదాల మీదీ ఎరుపు పోయేటట్టు రుద్దేసి, ఏమెరుగని వాడికి మల్లే ఆడుకోడానికి బయటకు పరుగు తీసేవాణ్ణి.

వక్కపొడి అందించింది అరుణ. దాన్ని నములుతూ ఆలోచిస్తున్నాను.

"ఏంటి ఆలోచన" అంది ఆకులకు సున్నం రాసిస్తూ.

"మధ్యాన్నం వచ్చిన సత్యం ఉత్తరం గురించీ..."

"మన చేనును ఈసారి ఎవరికి గుత్తకీయాలనా?"

"అదేం కాదు. ఎవరికిస్తాం? ఈసారి కూడా రామయ్యకే ఇస్తాం. అందులో ఆలోచించాల్సిందేముందీ?"

"మరీ" అంటూనే వక్కాకు నమిలిన నాలుకని చాపి ఎంత ఎర్రగయిందో ఓరగంట చూసుకుంది అరుణ.

"మన ఊరి గురించి... అదీ నీటిమునక కింద.." అని అంటున్నట్టే అందుకుంది అరుణ.

"మళ్ళీ మొదలయిందీ.. మధ్యాన్నం బాధపడ్డావు కదా. అందులో ఈ రోజు మునిగిపోతోందా ఏమన్నానా! ఎప్పుడో కదా" అంటూనే మంచాలకు దోమతెరలు కట్టడం ప్రారంభించింది.

"ఎప్పటికయినా మన ఊరు ఉండదు అనుకుంటూ ఉంటే.." మరి ఇంకేం మాట్లాడాలో తోచక ఆగిపోయాను.

"అదా! మీ ఊరు ఒక్కటే కాదులే, ఇంకా పధ్నాలుగు ఊర్లు నీటి మునకలో పోతాయంట గదా!" అంది నవ్వుతూ.

నేనూ నవ్వేశాను. సిగరెట్టు అంటించుకుని కాలుస్తూ ఉన్నాను.

దోమతెరలు కట్టే పని అయిపోగానే నా పక్కన కూచుని అంది అరుణ - "రేపోసారి ఊరికి పోయి రావే! అక్కడి పరిస్థితులూ, అవీ.. ఎట్లా రేపు సెలవే కదా!"

"అవునే, అందరం పోదామా" అన్నాను.

"పిల్లలకి పరీక్షలబ్బా - అందరం ఎందుకులే? అందులోనూ మునిగిపోతుండేది మీ ఊరేగా!"

"అంటే?" అడిగాను.

కొంటెగా చూస్తూ "మా ఊరు బళ్ళారి కదా" అంది అరుణ కొంటెగా చూస్తూ.

"ఆడ బుద్ధి పోనిచ్చుకోలేదు చూడూ" అంటూ తలపై సున్నితంగా మొట్టాను - నవ్వుతూ.

❀❀❀

ఉదయమే హిందూపురంలో బస్సు ఎక్కాను. తొమ్మిదింటికల్లా అనంతపురం బస్టాండు చేరుకున్నాను. బస్టాండు చాలా రద్దీగా ఉంది. అప్పటికి ఇంకా కళ్యాణదుర్గం బస్సు రాలేదు. ఎంక్వయిరీలో అడిగితే మరో అరగంటకు వస్తుందన్నారు.

తుఫానుకు సంబంధించిన ముసురు పట్టినందువల్ల జినజిన చినుకులు పడుతూనే ఉన్నాయి. రేడియోలో వార్తల్ని బట్టి మరో 24 గంటల పాటూ సూర్యుడు కనపడే అవకాశమే లేదు. కోస్తా ప్రాంతంలో తుఫాను వస్తే, అనంతపురంలో తుంపర పడుతుందన్నది ఇక్కడ అందరికీ తెలిసిన విషయమే. బస్టాండు బాగా రద్దీగా ఉంది. సిగరెట్టు వెలిగించుకుని ఓ బెంచీ మీద కూచున్నాను, బస్సు కోసం ఎదురుచూస్తూ.

"జానకిరామా, బాగుండావేమిరా" అన్న పలకరింపుతో తలెత్తి చూశాను. నవ్వుతూ నల్లప్ప

కనిపించాడు.

"ఆc. బాగుండానురా. నువ్వు బాగుండావో" అంటూ కుశలప్రశ్న వేశాను.

"చాన్నాళ్ళయిందిరా నిన్ని జూనీ. కొంచెం లావయినావప్పా. యాడ ఉండేది - హిందూపురంలోనేనా?"

అవునంటూ తల ఊపాను. నల్లప్ప తలంతా నెరిసిపోయింది. ముఖంలో ముసలితనపు ఛాయలు కనబడుతున్నాయి. నలభై అయిదేళ్ళకే డెబ్బై అయిదేళ్ళు మీద పడ్డవాడిలా అవుపిస్తున్నాడు. నల్లప్పది మా పక్క ఊరే. మా ఇద్దరిదీ దాదాపు ఒకే వయసు. మా ఊరి హైస్కూల్లో నేనూ, నల్లప్పా ఏడో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం. వాళ్ళ నాయన చనిపోవడంతో ఏడో తరగతిలోనే చదువు మానేసి వ్యవసాయంలోకి దిగాడు. అప్పటి నించి ఏ తిరునాళ్ళకో, ఏ పండక్కో మా ఊర్లో ఉన్న వాళ్ళ బంధువుల ఇంటికి వచ్చినప్పుడు నాతోనే గడిపేవాడు.

"ఇట్లెక్కడికి పోయింటివి?" అడిగాను.

"ఈటికే. అనంతపురానికి వచ్చింటి. మా పెద్ద పాపకి సమ్మందము చూసేకి."

ఆ మాటా ఈ మాటా మాట్లాడుతున్నట్టే కళ్యాణదుర్గం బస్సు రానే వచ్చింది. ఆలస్యం చేయకుండా ఇద్దరం బస్సులో కూచున్నాము. బస్సు అయిదు నిమిషాల్లో బయల్దేరింది.

"ఇంకేమిరా విశేషాలు?"

"ఏమున్నాయిరా?" అంటూ నవ్వాడు నల్లప్ప.

"డామ్ కడుతున్నారంట కదా పెన్నేటి మీద" అంటూ నేనే విశేషాన్నందించాను.

"ఊc అంటుండారు.. ఏం చేయాలో దిక్కు తెల్లేదు."

"మనమేం చేయగలం? అది గవర్నమెంటు నిర్ణయం కదా".

"ఏం నిర్ణయమో! నా యట్లా వాళ్ళకి పెద్ద దెబ్బ!"

నల్లప్ప కళ్లలోకి చూశాను.

"అవున్రా, ఉన్న ఇరవై ఎకరాల్లో పదెకరాలు అమ్మి పిల్లలిద్దరి పెండ్లిండ్లూ చెయ్యల్లని అనుకుంటి. ఇప్పుడు నీటి మునకలో పోతుందని ఎవురు కొంటారు?"

"కొనకుంటేనేంరా? గవర్నమెంటు నష్టపరిహారం కట్టిస్తుంది కదా."

"ఏ నష్టపరిహారమైనా అంతంతమటుకే కదా!"

కండక్టరు టికెట్ల కోసం మా దగ్గరికి వచ్చాడు. నల్లప్ప వారిస్తూ ఉన్నా, వాడి టికెట్టు కూడా నేనే తీశాను. వాడు నొచ్చుకున్నాడు. 'ఏం పర్వాలేదులే' అంటూ వాడి చేతిని ఆప్యాయంగా నొక్కాను.

నవ్వాడు నల్లప్ప. అనంతపురం మునిసిపల్ లిమిట్సు దాటింది బస్సు. టికెట్లు కొట్టడం పూర్తి అయినట్టు ఇనుపకడ్డీ మీద 'ఠంగ్' మంటూ శబ్దం చేశాడు కండక్టరు. బస్సు వేగం పుంజుకుంది.

"ఊఁ - చెప్పు చెప్పు నష్టపరిహార విషయం.." అడిగాను నల్లప్పను.

"అంతంతమటుకేరా. అసలే మన దిక్కు భూముల రేట్లు తక్కువ. పదెకరాలు అమ్మినా ఒక లక్ష రూపాయలు కండ్ల జూడము. ఇంగ గవర్నుమెంటు ఇచ్చే నష్టపరిహారం అంతంతే. మన భూమికి చుట్టుపక్కల భూములు ఎప్పుడో కొన్ని ఏండ్ల కిందట అమ్మేసిన రేట్లని లెక్కలోకి తీసుకోని సారాసగటు మింద దుడ్లు కట్టిస్తారు. పదెకరాలకీ అంతా ఏ యాభైవేలో పరిహారంగా ఇస్తారంతే..!" అంటూ చెప్పుకుపోతున్నాడు నల్లప్ప.

'అట్లనా' అనేసి ఆలోచనల్లో పడిపోయాను - కిటికీలోంచి దూరంగా బద్దకంగా కదులుతోన్న కొండల వైపు చూస్తూ.

"కనీసం ఏడెనిమిదేండ్లయినా పట్టొచ్చునంట డామ్ కట్టేకి" అన్నాడు నల్లప్ప.

"ఊఁహూఁ.. ఆలోగా అందరి ఇండ్లకీ, భూములకీ నష్టపరిహారం చెల్లించేసి ఊర్లను ఖాళీ చేయిస్తారేమో కదా".

"అంతే మడి! యాటికి పోవల్లో అర్థం కాలేదురా. యా ఊరుగాని ఊరికో పోయి, వీళ్ళిచ్చే దుడ్లతో దారెడు నేల కొనుక్కోని ఒక ఈతాకు గుడిసె ఏసుకోని ఉండల్ల కదా - అని అనుకుంటా ఉంటే మనసంతా పిండేసినట్లు అయిపోతా ఉందప్పా జానకిరామా" అన్నాడు. అట్లా మాట్లాడుతుంటే వాడి గొంతు జీరపోవడం గమనించాను.

"నిజమేరా" అన్నాను. ఎన్నో విషయాలు వాడితో చెప్పుకోవాలని ఉన్నా నాకు మాటలు పెగల్లేదు. మౌనంగా ఉండిపోయాను.

గంట తర్వాత మా ఊరి పొలిమేరల్ని సమీపిస్తోంది బస్సు. దూరంగా సుగాలీల గుడిసెలూ, ఎర్రటి మిద్దెలూ కనబడుతున్నాయి. వాటికి కొద్ది దూరంలో పెన్నేటి మీద బ్రిడ్జీ, దానికి మరికాస్త దూరంలో మా ఊరి తాలూకు ఇళ్ళూ, గడ్డివాములూ కనిపిస్తున్నాయి.

బ్రిడ్జి దాటి ఊరు చేరింది బస్సు.

"నేను పొయ్యొస్తాన్రా" అని చెప్పేసి బస్సు దిగాను. నాతో పాటు నలుగురు ప్రయాణికులు దిగారు. వాళ్ళు మా ఊరివాళ్ళు కారు. ఏ ఇంటికయినా చుట్టపు చూపుగా వచ్చారేమో.

ఆకాశం నల్లటి మేఘాలతో నిండి ఉందే కాని, వర్షం పడటం లేదు. టైము చూసుకున్నాను. పదకొండు గంటలయింది.

బస్సు వెళ్ళిపోయింది.

దూరంగా వేపమాను కింద బడిగే హనుమంతప్ప నాగలి చేస్తూ ఉన్నాడు. అతని చుట్టూ నలుగురు రైతులు మొద్దులపై కూచుని మాట్లాడుతూ ఉన్నారు. హనుమంతప్ప ఏదో మాట్లాడితే వాళ్ళందరూ నవ్వుతున్నారు. దానికి కొద్ది దూరంలో ఉన్న ఈతాకు కొటం హోటలులో కొందరు కాఫీలు తాగుతున్నారు. మరికొందరు ఒగ్గానీ (తిరగువాత బొరుగులు) తింటున్నారు.

పళ్ళూ పూలు ఉన్న సంచిని ఎడమ చేతి నుంచి కుడి చేతిలోకి మార్చుకొని మెల్లగా మా ఇంటి వైపు నడక సాగించాను. దార్లో ఎదురయిన వాళ్ళందరూ ఎంతో ఇష్టంగా పలకరిస్తున్నారు. అందరికీ నవ్వుతూ సమాధానం చెబుతూ సాగిపోతున్నాను. ఈ మనుషులూ, ఈ ఇళ్ళూ, ఈ సందులూ నాకు ఎంతిష్టమో చెప్పలేను. ఎవరయినా వాళ్ళ ఊరిని గురించీ చెబితే నేను ఊహించుకునేది ఈ ఊరినే. ఏ నవలలోనో, కథలోనో ఊరిని వర్ణిస్తే నా మనసులో చిత్రిక పట్టేది ఈ ఊరి పరిసరాల్నే.

మా ఇల్లు చేరుకున్నాను. మా తమ్ముడు సత్యం ఇంటి బయట ఉన్న అరుగు మీద కూచుని కలబంద నారతో పగ్గం పేడుతూ ఉన్నాడు.

“ఏయ్! ఏమే, మా అన్నయ్యొచ్చినాడు, కాళ్ళకు నీళ్ళు దీసకరా” అంటూ ఇంట్లోకి కేకేసి కుశలప్రశ్నలు వేయడంలో ఉండిపోయాడు.

శాంతమ్మ (తమ్ముడి భార్య) పెద్ద ఇత్తడి చెంబుతో వేడినీళ్ళు తెచ్చి ఇస్తూ ‘ ఏం బావా? చాన్నాళ్ళకి వస్తివి. అక్కా పిల్లలూ బాగుండారా” అంది.

ఆమెకు సమాధానం చెప్పి ముఖం, కాళ్ళూ కడుక్కుంటుంటే, “పెదనాయిన వచ్చినాడే, బాగుండావా పెదనాయినా? పెద్దమ్మనీ, శ్యామల, కళ్యాణీలనీ తోలుకురాగూడదో చూస్తుంటిమి” అంది తమ్ముడి కూతురు వసంత. నిన్నా మొన్నటి పిల్ల అప్పుడే పైటలేస్తోంది. ఆ పాపకూ సమాధానం చెప్పి సత్యం పక్కనే కూచున్నాను వాడి టవల్‌తో ముఖానికున్న తడిని ఒత్తుకుంటూ.

అయిదు నిమిషాల్లో కాఫీ చేసుకుని జానెడు స్టీలు గ్లాసుకు తెచ్చింది శాంతమ్మ. తాగుతున్నాను. నేను వచ్చినట్టు ఎట్టా తెలిసిందో ఏమో, వెంకటపతి మామా, ఓబుళేసు చిన్నాయనతో పాటు ఇరవై మంది చిన్నా పెద్దా, ముసలీ ముతకా వచ్చి మా ఇంటికి రెండు వైపులా ఉన్న అరుగుల్లో నిండిపోయారు.

“ఇంగేడ ఊరు నాయిన్నా. అంతా మునిగిపోతాదంట” అన్నాడు నలమాలప్ప తాత. ఊతకర్ర చేతపట్టుకొని వణకుతూ నా కళ్ళలోకి చూసే ప్రయత్నం చేస్తున్నాడు.

“నువ్వు సూడంగ ఈ ఊరు మునిగిపోదులే తాతా! ఇంగా ఎట్ల లేదన్నా పదేండ్లు పట్టదా డామ్ పూర్తి అయ్యేకి - నవ్వెంత కాలం బతుకుతావు. ఇంకా అయిదేండ్లకి గుంతకి పోవా” అన్నాడు నా పక్కనే కూచుని ఉన్న పదారేళ్ళ సీనుగాడు, తాతని ఆట పట్టించాలని.

అందరూ గలగలమంటూ నవ్వారు.

"నగండి నాయినా, నగండి.. నేనెట్లా ఈ పొద్దో, రేపో గుంతకి పోతా. నా సంగతి ఇడిసిపెట్టు. ఎవురు పోయినా ఊరు సల్లగుండల్లరా. కన్నతల్లి కంటే ఎక్కువరా! ఊరంటే ఏడిదనుకున్నేడో తిక్కనాకొడుకు.. మన తాతలు, ముత్తాలు ఈ ఊర్లోనే బతికినారు. ఈ ఊరి ఏటి గడ్డలోనే కలిసిపోయినారు.. రేపు నేనూ అదే ఏటి గడ్డలో కలిసిపోతా.. సచ్చిపోయేకి యానాకొడుకు యదబడుతాడులే. ఈ యంగటేసూ, ఆ మల్లేసూ, ఈ ఓబుళపతీ, ఆ రోశయ్య అందరూ ఈ ఊరు పాదయిపోతే యాటికో పోతారు గదప్పా! అదే నా యదారంతా. ఈ పొద్దు ఈ జానకిరామప్ప వచ్చె, మనూరోడనీ, మనోడనీ, హిందూపురాన్నించీ వచ్చినాడని తెలుత్తానే ఇంత మందిమి వచ్చి ఈడ ముసురుకొంటిమి. ఇదంతా ఊరు సలవే గదేమప్పా. రేప్పొద్దన ఊరు మునిగిపోయినాక ఒకాయప్ప అనంతపురమూ, ఒకాయప్ప బళ్ళారీ, ఇంకోకాయప్ప కళ్యాణదురగమూ, ఇంకా ఒకాయప్ప రాయదురగమూ చేరతారు. ఇట్ల దిక్కులకి ఒకరయి పోతా(రా" అంటూ పూడుకుపోతున్న గొంతుతో నలమాలప్ప తాత మాట్లాడుతూ ఉంటే అంతవరకూ నవ్విన వాళ్ళందరూ కిమ్మనకుండా గమ్మున ఉండిపోయినారు. అందరి ముఖాల్లో వేదన కనిపించింది. నాకు ఒక్కసారి భోరున ఏడ్చేయాలనిపించేంత దుఃఖం పొంగుకొచ్చింది.

"ముసిలోడేందో మాయ జేసెగదరా అందర్నీ నోరెత్తకుండా జేసె" అన్నాడు ఓబుళేసు చిన్నాయన - వాతావరణాన్ని తేలిక చేయాలని అట్లా అన్నాడేమో మరి.

"మాయ గాదురా ఓబుళేసూ, ఉండేదంతే-" అనేసి తను చెప్పేదింక ఏమీ లేదన్నట్టు 'పొయ్యొస్తారా జానకిరామా' అని చెప్పేసి అరుగు దిగి కఱ్ఱ ఊతంతో మెల్లగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు నలమాలప్ప తాత.

"ముసిలోడు చెప్పింది రైటేరా. ఉన్న ఊరు కన్న తల్లే మడి. ఈ జానకి రామునికి ఎంత (పేమరా ఊరంటే - నా చేను ఎప్పటికి అమ్మను, అమ్మితే ఈ ఊరు నా ఊరు గాకుండా పోతుంది కదా అని ఈయప్ప వాదన - నీ ఊరు మీద మమకారం జూసి ఎంత సంతోషమయ్యేదిరా నాకయితే - పోగాలం వచ్చినప్పుడు అన్నీ పోతాయిరా. ఇప్పుడు నువ్వు అమ్మను అన్న నీ చేనుని గవుర్నమెంటోడు ఇడుస్తాడా" అంటున్నాడు వెంకటపతి మామ నన్నుద్దేశించి.

"అవును పాపం. ఊరన్నా, చేనన్నా అంత (ప్రాణం వీనికి - గవుర్నమెంటు ఉద్యోగాల్లో పెద్ద పట్నాల్లో ఉన్నా, మీ ఊరు యాది అని ఎవురన్నా అడిగితే, ఈ ఊరి పేరేరా వాడు చెప్పేది!" అంటున్నాడు ఓబుళేసు చిన్నాయన. అతని మాటలకి ఎందుకో నా కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఒరే సత్యమూ! జానకిరామన్నకి వాని చేన్ను ఒకసారి చూపించుకొని రాపోరా పాప్పూ" అన్నాడు వెంకటపతి మామ.

"ఊఁ ఊఁ. మీరు మాట్లాడేది అయిపోతే - అట్ల పొయ్యొస్తాము" అన్నాడు సత్యం.

అరగంట తర్వాత భోం చేసుకుని చేను వైపు బయల్దేరాము నేనూ, సత్యం, వెంకటపతి మామా, ఓబుళేసు చిన్నాయనా.

ఊరికి పడమటి దిశగా కృష్ణాపురం వంకకి ఇవతల ఉన్నాయి మా చేలన్నీ.

వేరుసెనగ పైరుతో కళకళలాడుతున్న చేనులు దారికిరుపక్కలా ఉన్నాయి.

నా చిన్నతనంలో ముంగారు పంటలుగా పచ్చజొన్నా, తెల్లజొన్నా, సజ్జా, పెసరా, అలసందా, కందీ వేసేవాళ్ళు. పాతిక ముప్పయ్యేళ్ళుగా అన్నీ చేలల్లో వట్టి వేరుసెనగే వేస్తున్నారు. చుట్టుపక్కల ఊళ్ళలో వేరుసెనగ పండించడంలో మా ఊరిదే పైచేయి. అసలే కరవు ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన అనంతపురంలో జిల్లాలో వచ్చే అడపాదడపా వానలకి ఒక్కోసారి రైతుకి వేసిన విత్తనం తిరిగీ అందడమే కష్టం... అయితే, చుట్టుపక్కల ఊళ్ళలో విత్తనం కూడా తిరగని స్థితిలో, మా ఊళ్ళో విత్తనం తిరిగింది. తక్కిన ఊళ్ళలో మామూలు పంట పండిందంటే, మా ఊళ్ళోని రైతులకు గొప్ప పంటలు పండినట్లే లెక్క! మరి మా భూములే మంచి భూములో, లేదంటే మా ఊరికి ఒకవైపు పెన్నేరూ మరో వైపు హనిమిరెడ్డిపల్లి చెరువూ, ఇంకో వైపు కృష్ణాపురం వంక ఉండడం కారణమేమో చెప్పలేం.

"ఈసారి పర్వాలేదన్నా సెనిక్కాయ బాగానే ఉంది" అన్నాడు సత్యం.

"వానలు అసలైన కాలం రాకుండా అగ్గిపడిపాయెనప్పా. లేకుంటేనా బ్రమ్మాండ్లంగా పండుతాండే. నేను ప్రాయంలో ఉన్నెప్పుడు వస్తాండే వానలు గీన ఇప్పుడొస్తేనా, బంగారు పొగెగురుతాండె" అన్నాడు ఓబుళేసు చిన్నాయన.

దూరంగా ఏవో చెట్లు నాటుతూ ఉండడం కనిపించింది. "మామా! ఎవురో చీనీ చెట్లో, నిమ్మ చెట్లో నాటుతున్నారు" అనడిగాను వెంకటపతి మామని.

"వాళ్ళా.. నారాయణరెడ్డి వాళ్ళు లేరా. నారాయణరెడ్డి అంటే ఎగువపల్లి తిప్పారెడ్డి కొడుకు. చీనా చెట్లు నాటుతుండారులే."

"ఆహాఁ ఇప్పుడు చీనీతోట వేసేదేందీ. ఎందుకట్లా పని చేస్తున్నారు. చీనీ పంట చేతికి అందే లోపలే గవర్నమెంటు స్వాధీనం చేసుకుంటుంది కదా. తిక్కపని!" అన్నాను.

వెంకటపతి మామ నవ్వి "వాళ్ళు తిక్కోళ్ళు కాదురా! నువ్వూ నేనూ తిక్కనాయాళ్ళూ!" అన్నాడు.

నాకర్థం కాలేదు.

"దుడ్లు సంపాదించుకొనేకి అదొక ఎత్తురా" అన్నాడు ఓబుళేసు చిన్నాయన.

"ఎట్లెట్లా?" అన్నాను ఆయన కళ్ళలోకి చూస్తూ.

"గవుర్నమెంటోళ్ళు భూస్వామి నష్టపోకుండా ప్రతి చెట్టుకీ నష్టపరిహారం కట్టిస్తుంది. అదేదో - పేపర్లో స్టేటుమెంటిస్తారే ఫలానా భూమిని మేం స్వాధీనం చేసుకుంటున్నాం అంటూ, దానికి ముందే

భూమిలో నాటిన చెట్లకు దుడ్లు కట్టిస్తారంట. అందుకే వాళ్ళు ఆ అగచాట్లు పడుతుండారు" అంటూ బీడీ అంటించుకొనేకి నడక మెల్లగా సాగిస్తున్నాడు ఓబుళేసు చిన్నాయన.

"దుడ్లుండే వాళ్ళు ఇంగా ఇన్ని దుడ్లు జేసుకుంటారన్నా" అన్నాడు సత్యం.

"ఇంత తిప్పలు పడే బదులూ ఆ భూమినే ఎక్కువ రేటు ఉండేటట్లు వేయించుకుంటే సరిపోయేది కదా" అన్నాను.

"అదీ దశలవారీగా చేస్తారు. వీళ్ళ భూముల రేట్లు పెరిగేకి తమ భూముల్ని దగ్గర బంధువులకే అమ్మేసుకున్నట్లు నాటకమాడినారు. ఇంక భూ సంపాదన అధికార్లకి రేటు పెంచడానికి అంతో ఇంతో ముట్టజెప్పి వచ్చినారు. దాంతో మరీ రేటు పెరుగుతుంది. అక్కడితో కత ఆగిపోదు. తగినంత రేటు గవర్నమెంటు ఇవ్వలేదని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తారు. పెద్దోళ్ళకు న్యాయం ఎట్లనూ జరుగుతుంది కాబట్టి, అక్కడా న్యాయం జరక్కేమవుతాది" అన్నాడు వెంకటపతి మామ.

"మనమూ అట్లే చేస్తే సరి" అన్నాను.

"మనకుండే చారెడు భూమికి అంతంత ఖర్చు పెట్టుకుంటే అడుక్కు తినుకుంటా పోవల్ల" అన్నాడు ఓబుళేసు చిన్నాయన.

"పెద్ద పెద్ద భూస్వాములకయితే మంచి లాభసాటి వ్యవహారమే. మనట్లా వాళ్ళకి ఏది చేసినా నష్టమే" అన్నాడు వెంకటపతి మామ.

పట్నంలో ఉండి ఎన్నో తెలుసుననుకున్న నేను ఇవన్నీ కొత్తగా వింటున్నాను.

మా మెత్తన్నేల చేరు చేరుకున్నాము. పచ్చగా వేరుసెనగ పైరు పరుచుకుని ఉన్న 10 ఎకరాల చేను అది. చేను చుట్టూరా కలబందా, ఊరుకల్లీ కంచెగా ఉండటమే దానికి మరింత అందం. అందులో బోరు వేయించి అక్కడ ద్రాక్ష తోట పెట్టాలని నా చిరకాల వాంఛ! ప్రస్తుతం ఆ ఆలోచన విరమించుకోవాల్సిందే - మా చేనుకు పక్కనే మా పెద్ద తాత వాళ్ళ బావి. దానికి కొద్ది దూరంలో మా అవ్వ సమాధి. చేనుకు ఎదురుగా చిన్న చింతతోపు - అందులో ఆరు చింత చెట్లున్నాయి. వేసవి సెలవుల్లో ఇక్కడే గడిపేవాడిని.

"అన్నయ్యా నువ్వా చీనీ చెట్లు నాటించు ఎక్కువ పరిహారం వస్తుంది" అన్నాడు సత్యం.

వాడి వైపోసారి చిత్రంగా చూసి ఊరికే ఉండిపోయాను. తాతలనాటి భూమి నానించీ దూరమైపోతుంటే, దీనిపై వ్యాపారం చేసుకోడానికి చెట్లూ, పుట్లూ నాటడం నా వల్లగాని పనిరా అని చెప్పడానికి మాటలు పెగల్లేదు.

వాళ్ళందర్నీ వదిలేసి చిన్న చింతతోపులోని పెద్ద చింతమాను కిందకు వెళ్ళి ఓ రాయి మీద కూచున్నాను.

"ఏరా, సాలయిపోయిందా" అన్నాడు వెంకటపతి మామ.

"ఏం లేదు" అన్నాను". నా చిన్ననాటి జ్ఞాపకాల్ని ఏరుకుంటున్నాను అని చెప్పలేక.

ఇక్కడి ప్రతి అణువణువూ నాకొక స్మృతిరేణువే!

పంటల కాలంలో ఈ చెట్ల కిందే కళ్ళం చేసేవాళ్ళం. రాత్రిళ్ళు కళ్ళానికి కాపలా కాసేవాళ్ళం. రాత్రిళ్ళు అన్నాలు తింటూనే నేనూ, సత్యం, ఆనందూ, ఎర్రోడూ విరాట పర్వమూ, చెంచులక్ష్మి నాటకాల్లోని పద్యాల్ని నిద్దర వచ్చేవరకూ నోటికొచ్చిన రాగంలో పాడేవాళ్ళం. ఏ వెన్నెల రాత్రో గాడిదలు దొరికాయా ఇంకంతే. తెల్లవార్లు గాడిదలపై సవార్లు - వంతుల వారీగా. ఉదయం ఇంకా ఇంటి నుంచి అన్నం రాకనే చిన్నా చితకా ఈత చెట్లని కొట్టి లేత ఈతగడ్డ తినేయడం. ఇంటి నించి మా అన్నం రావడమే ఆలస్యం ముందు ఆవురావురని తినేయడం, మా ఆవుల్ని తోలుకుని దగ్గర్లోనే ఉన్న కృష్ణాపురం వంకకు పోయి వంకలో చేపల వేట జోరుగా సాగించడం.

"పోదాం పదరా! పైటేలయింది" అని వెంకటపతి మామ అనడంతో స్మృతుల్లోంచి జారిపడ్డాను.

అందరం ఊరి దారి పట్టాము.

❀❀❀

అనంతపురానికి వెళ్ళే బస్సు వచ్చి ఆగింది.

"వస్తానన్నా. వదిన్నీ, పిల్లల్నీ ఉగాదికి పంపియ్యి. వీలయితే నువ్వూ రా" అంటున్నాడు సత్యం. బస్సు ఎక్కే హడావిడిలో ఉన్న నాతో.

"సరే" అంటూ బస్సెక్కి కూచున్నాను. మనసంతా బరువుగా ఉంది.

బస్సు కదిలింది మెల్లగా.

హైస్కూలు వైపు, ఏటి వైపు ప్రేమగా చూస్తున్నాను. నా చిన్ననాటి అనుభవాలు ఎన్ని ఇక్కడ చల్లుకున్నానో.. స్కూలు ఎగ్గొట్టి పెన్నేట్లోని నల్లరాతి మడుగులో ఈదుతూ కొట్టిన కేరింతలూ, హెడ్మాస్టరు అక్కడికి వస్తున్నాడని తెలిసీ చచ్చే చావెరక్క పరిగెత్తడాలూ...

ఎంత తొందరగా రీలు తిరిగిపోయింది!

బ్రిడ్జి దాటింది.

తాండా గుడిసెలు దాటింది బస్సు.

ఊరు వెళ్ళిపోయింది.

"ఈ బ్రిడ్జి నించీ సోములదోపు వరకూ డామ్ కడతారంట కద రెడ్డీ. అయితే, మీ ఊర్లన్నీ నీటి మునక కిందకి వస్తాయి" అంటున్నారెవరో నా వెనుక సీట్లోంచి.

"అవును".

తల తిప్పి చూశాను. అడుగుతున్నాయన ఎవరో నాకు తెలీదు. కానీ, అవును అన్న శాల్తీ మాత్రం మా ఊరి తిమ్మారెడ్డి కొడుకు శ్రీధర్‌రెడ్డి, అతనితో నాకు అంత పరిచయం లేదు. అందుకే పలకరించలేదు నేను.

"మరింకేం, భూములపై భారీగా డబ్బు సంపాదించే ఏర్పాటు చేస్తుంటారే మీ ఊరివాళ్ళు. మీకేం పర్వాలేదులే.. లేనివాళ్ళకే ఇబ్బందంతా" అన్నాడు కొత్తాయన.

"ఏమీ లేనోళ్ళకైనా వాళ్ళ స్థాయిని బట్టి ఇస్తుంది కదా కాంపెన్సేషను" అన్నాడు శ్రీధర్‌రెడ్డి.

"ఆహాఁ అది కాదు రెడ్డీ - నా పాయింటు క్యాచ్ చేయడం లేదు నువ్వు. మీరు లేని తోటల్ని పెంచీ చెట్టు కింతా అని పరిహారం తీసుకుంటారు గవర్నమెంటుతో. అక్కడితో ఊరుకోరు. ల్యాండు ట్రిబ్యునల్‌కి పోయి నల్లకోట్లతో వాదింపజేసి కోరినంత కాంపెన్సేషన్ సంపాయించుకోగలరు. అలగా జనానికి అంత తెలివీ, అంత భూమీ, అంత డబ్బూ ఉండద్దా - టేకిట్ ఈజీ.. ఇలా అంటున్నానని ఏమనుకోవద్దు రెడ్డీ!" అన్నాడు కొత్తాయన.

"అదేం లేదులే.. ఎంత చెట్టుకంతగాలి.. ఏమైతేనేం, మన గవర్నమెంటుకి అందరూ సమానమే.. అందరికీ డబ్బు కట్టిస్తుంది కదా.. అంతవరకూ సంతోషించల్ల మనం!" అంటున్నాడు శ్రీధర్‌రెడ్డి.

"ఉన్న భూములకూ, ఇళ్ళకూ, చెట్లకూ నష్టపరిహారం చెల్లించే మీ గవర్నమెంటు మా అనుభూతులకూ, అనుభవలకూ, మా జ్ఞాపకాలకూ నష్టపరిహారం చెల్లించగలదా. పరిహారం డబ్బుతో నా ఊరిని కొనుక్కోగలనా. నా స్మృతుల్ని కొనుక్కోగలనా" అని వెర్రిగా అరవాలనిపిస్తోంది. మాటలు పెగలనీయకుండా గొంతు పూడుకుపోయినట్టుంది. కనుకొలకుల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

- ఇండియాటుడే, వార్షిక సాహిత్య సంచిక 1995